# జక్కం వీరన్న

మేస్త్రి వీరాస్వామిగారింటి సందు దాటాకా కుడి పక్క మలుపులో కంసాలి బుద్ధాచారి ఇంటవతలుంది జక్కం వీరన్న ఇల్లు. యానాం పక్కనున్న నీలపల్లి, పెద్దాపురం లాంటి వూళ్ళు తిరిగి కొమ్ములు తిరిగినోళ్ళ దగ్గర వడ్రంగి పని నేర్చుకొచ్చిన జక్కం వీరన్నకి మా ఏరియాలో చాలా గొప్ప వడ్రంగి మేస్త్రన్న పేరుంది. జనంకూడా అతన్ని మడతమంచాలూ, కుర్చీలూ బల్లలూ చేసే పనికి కాకండా ద్వారబంధాలకి ఎడాపెడా నెమళ్ళు కిటికీలకి చెరో చిలక్కొయలూ, ఇత్తడి గొలుసుల ఉయ్యాలబల్లల అంచులకి పందిరి మల్లి తీగలూ లాంటివి చెక్కే గొప్ప పనులకి పిలుస్తారు. జక్కం వీరన్న గొప్పదనం ఏంటంటే ఫలానా చెక్క అనిగాకండా ఎలాంటిచెక్క మీదయినా సరే ఏదనుకుంటే అది చెక్కేసేవాడు. ఆఖరికి దేవదారు చెక్క మీద కూడా వినాయకుడి బొమ్మ చెక్కెయ్యగల సమర్థుడు. గొప్పగొప్ప మేస్త్రులొచ్చి జక్కం వీరన్న పనిచూసి ఈడు మామూలు మనిషికాడు అని దణ్ణాలు పెట్టేసేవారు.

అయితే,

మామూలు మేస్త్రులకి రోజుకి పాతికిస్తే జక్కన్నకి నూట పాతికివ్వాలి. పొద్దుట ఓ గంటసేపు శివుడికి పూజ చేసుకున్నాకా ఎవరైతే పనికి తీసుకెళ్ళాలనుకుంటున్నారో వాళ్ళు సైకిలేసుకొచ్చి వెనకాల ఎక్కించుకు తీసుకెళ్ళాలి.

ఇక వీరన్న దిగేడంటే అతను ఎలా చెక్కుతాడో చూద్దామని చాలా మంది దిగిపోయేవారు. సొంతంగా తయారు చేసుకున్న ఉలుల్ని కాకీ సంచుల్లోంచీ, చెక్క పెట్టిల్లోంచీ తీస్తుంటే విచిత్రంగా చూసేవారు. పని మొదలెట్టేక మన లోకంలో ఉండేవాడు కాదు.

మధ్యాన్నం భోజనం పనికి పిల్చుకొచ్చిన వాళ్ళే పెట్టాలి. నీచుముట్టుకోడు. కూరల్లో నీరుల్లిపాయకూడా తగలకూడదు. అతను అడిగినప్పుడల్లా టీలు ఇవ్వాలి. తిరిగి సాయంత్రం సైకిలు మీద వాళ్ళింటికాడ దిగబెట్టాలి.

ఇన్ని డిమేండ్లు చేసే జక్కం వీరన్నకి క్షణం తీరికుండేది కాదు. ఎక్కడెక్కడినించో వచ్చేవి పిలుపులు. రాలేను మొర్రో అంటే ఇంతనిగాదు ఎంతగావాలంటే అంతిస్తాం అని లాక్కుపోయేవారు వీరన్నని.

* * *


ప్రత్తిపాడు అవతలున్న ఉత్తరకంచిలో శ్రీరాజా వత్సవాయి వెంకట్రాఘవరాజు గారికి నాలుగొందల ఎకరం భూముంది. రెండు వందల ఎకరం చెరువుంది. ఆ చెరువు ఒడ్డున ఒకనాటి రాజప్రాసాదాలు గుర్తొచ్చేంత గొప్ప విలాసమందిరం కట్టడం కోసం పెద్దాపురంలో ఉన్న గొప్ప తాపీ మేస్త్రుల్ని పిలిపించేరు రాఘవరాజుగారు. చెరువులో విహారానికి లాంచీనికూడా తయారు చేయిస్తున్నారు. రాజహంస అని పేరు పెట్టబోయే ఆ లాంచీ తలుపులూ, లోపల కిటికీలూ, కుర్చీలూ గొప్ప గొప్ప నెగిషీల్తో నిండిపోవాలి. ఆ పన్లకోసం జక్కం వీరన్నని పిలిపించేరు.

పన్లు మొదలయ్యినియ్యి.

శ్రీరాజా వత్సవాయి వెంకట్రాఘవరాజుగారు కుక్కలు ఎక్కువ పెంచడంతో ఆయన్ని కుక్కలరాజాగారు అని కూడా పిలుస్తారు. ఊళ్ళో ఉన్న దివాణంలో ఓ ముప్ఫై కుక్కలుంటాయి. వాటికోసం రోజుకి రెండు మేకల్ని కోసి పలావు వండేవారు. ఆ మాంసం ఆ పలావులో కొంత ఓ గిన్నెలోకి తీసి గెస్ట్‌హవుసూ, రాజహంస లాంచీ పన్లకోసం వచ్చిన మేస్త్రులకి పెట్టేవారు.

మొదటి పన్నెండుగదులు భవనం పునాదులూ తర్వాత గోడలూ లేచినియ్యి. కొన్నాళ్ళకి శ్లాబ్ కూడా పడింది. ఇంకో మూల వేసిన కళాయిరేకుల షెడ్లో వడ్రంగి పని జరుగుతుంది.

నెమ్మదిగా పని మొదలెట్టే జక్కం వీరన్న చాలా తాపీగా చేసేవాడు పని. ద్వారబంధానికి ఎడాపెడా ఏక చెక్కమీద ఏనుగుబొమ్మల్ని చెక్కడానికి చాలా వారాలు పట్టింది. ఆలస్యం అయితే అయ్యిందిగానీ అది చూసినవాళ్ళ మతులు పోయినియ్యి. ఊళ్ళో వాళ్ళంతా పొలం వచ్చి చూసెళ్తున్నారు. భార్యల్తో పాటొచ్చి చూసెళ్ళేడు కుక్కలరాజుగారు. పదిరో పదిహేనురోజులయ్యే టప్పటికి పందిరిపట్టి మంచం మీద నెమలి బొమ్మలు చెక్కేడు.



పక్కనే ఉన్న అడివిలోంచి వచ్చిన ఒక నెమలి వీరన్న చెక్కిన నెమళ్ళ మధ్య నిలబడి తన ముక్కుతో ఆ చెక్క నెమళ్ళ ముక్కుల్ని పొడుస్తుంది.

భార్యల్తో పాటు అక్కడికొచ్చిన కుక్కలరాజు అది చూసి అవాక్కయిపోయి తన మిత్రులందరికీ చెప్పేడు. నిజవా అంటా దిగిపోయిన ఆ మిత్రులంతా నెమలిబొమ్మల్ని చూసి ''నిజమే సుమా నిజంగా ప్రాణం పోసుకున్నట్టున్నాయి'' అన్నారు.

ఆ సాయంత్రం పెద్ద పార్టీ ఏర్పాటు చేసేడు కుక్కలరాజుగారు..విదేశాల మందు సీసాకాయలు దిగినియ్యి. అడివికోళ్ళునీ. దుప్పుల్నీ, జింకల్ని కొణుసుల్ని వేటాడించి పట్టించి చాలా రుచికరంగా వండించేడు.

పార్టీ మంచి రసపట్టులో ఉంది.

జక్కం వీరన్నని పిల్చి అక్కడున్న అందరికీ పరిచయం చేసిన కుక్కలరాజగారు ''ఇవ్వేళ మాతో పాటు నువ్వుకూడా పుచ్చుకోవాలి'' అన్నాడు.

''నాకు అలవాటు లేదండీ'' అన్నాడు వీరన్న.

''మా అందరికీ ఉందా ఏదో దావతకి అలా పుచ్చుకుంటుండగా అలవాటయ్యిం''దన్నారు రాజుగారు.

''వద్దండీ నేను శివుడి భక్తుడ్ని'' అన్నాడు వీరన్న.

కుక్కలరాజుగారికి చాలా కోపమొచ్చింది. చేతికి దొరికినియ్యన్నీ బద్దలు గొట్టేసేడు. నోటికొచ్చినట్టు తిట్టేసేడు.

అయినా ఏం ముట్టుకోలేదు జక్కం వీరన్న.


మర్నాడు వెళ్ళిపోతానని గొడవ పెట్టేడు వీరన్న ''రాజులు అలిగేరని మనం అలగ కూడదురా'' అన్నాడు పెద్దాపురం నించొచ్చిన ముసలి మేస్త్రి. ''సరే'' అని ఆగిన జక్కం వీరన్న పందిరిపట్టి మంచానికి లతలు చెక్కే పనిలో పడ్డాడు. వాటిని చూసిన తక్కిన మేస్త్రులు కళ్ళు పెద్దవి చేసి ఊపిరి పీల్చడం మానేసేరు.

ఆ తర్వాత రాజహంస పేరు పెట్టబోతున్న ఆలాంచీకి ముందు దిక్సూచీ వేపూ, వెనక చుక్కాని వేపూ రెండు హంసల్ని చెక్కడం మొదలెట్టేడు. వీటి ప్రత్యేకత ఏంటంటే రెండు హంసలూ మధ్య భాగానికి వచ్చేసరికి ఒకటై పోతాయి.

ఆ బొమ్మలు చెక్కడానికి పెద్ద మానుకావాలంటే తెప్పిస్తున్నారు.

అయితే వీరన్న గొప్పతనం ఏంటంటే తనకి సాయం చేసే మనిషిని పక్కన పెట్టుకోడు అన్ని పన్లూ తనే చేసుకుంటాడు. అసలెవ్వర్నీ దగ్గరకి చేరనివ్వడు. పనిలో దిగేడంటే రాత్రీ లేదూ పగలూ లేదు. అలా చేసుకుంటా వెళ్ళిపోతాడంతే.

ఈసారి రాజహంస బొమ్మల్ని చూడ్డానికి ఎక్కడెక్కడ్నించో వచ్చి విరగబడి మరీ చూస్తున్నారు. మళ్ళీ రాజుగారి మిత్రబృందం వచ్చింది. ఆ తర్వాత ఆ మిత్రుల తాలూకు మిత్రులు ఆ మిత్రులకి మిత్రులూ అలా వస్తానే ఉన్నారు.



ఈసారి మళ్ళీ ఘనమైన విందు ఏర్పాటు చేసేడు కుక్కలరాజుగారు. ఒకళ్ళకి ఇద్దరికీ కాదు. రెండు వందలమందికి.

రెండుమూడు పెగ్గులయింతర్వాత జక్కం వీరన్న ముందుకొచ్చి నిలబడి నమస్కారం చేసిన కుక్కలరాజు ''నీలో కళామతల్లికి నా జోహార్లు... నిన్ను బలవంత పెట్టను. మాతో పాటు విందు ఆరగిస్తే చాలా సంతోషిస్తాం'' అన్నాడు.

చింత నిప్పుల సెగకి కరిగిపోయిన మైనం ముద్దలాగయిపోయిన జక్కం వీరన్న రాత్రికొంచెం పుచ్చుకున్నాడు. కొంచుసుమాంసం వేపుడుకూడా తింటుంటే చూసిన కుక్కలరాజుగారు చాలా సంబరపడ్డారు.

అక్కడ్నించి అక్కడ విందులు జరిగినప్పుడల్లా తప్పనిసరిగా వచ్చి తిని తాగేవాడు జక్కం వీరన్న.

పోనుపోను మందు మజా, మాంసం రుచీ బాగా అలవాటయ్యినియ్యి వీరన్నకి. ఇక అక్కడ్నించి పనయ్యాకా స్నానాలు చేసి కొంచెం తెచ్చుకుని పుచ్చుకునే తను కొన్నాళ్ళకి పెద్దాపురం మేస్త్రుల మధ్యలోకి దూరిపోయి వాళ్ళకంటే బాగా తాగేవాడు.

ఇంకొన్నాళ్ళు గడిచినియ్యి.

రాజహంస లాంచీ పని పూర్తవ్వొచ్చింది. చరిత్రలో మిగిలిపోయే పనది. ఆ లాంచీ లోపలగానీ బయటగానీ అన్ని మహాద్భుతాలు సృష్టించేడు జక్కం వీరన్న. అయితే ఇప్పుడు జక్కం వీరన్న మంచినీళ్ళకి బదులు మందు ఆరారా పుచ్చుకుంటూ పని చేస్తున్నాడు. ఆరారా అందించే మనిషినొకడ్ని పెట్టుకున్నాడు. అది లేకపోతే పని చెయ్యలేని స్థితికొచ్చేసేడు.

మూడేళ్ళయ్యింది.

కుక్కలరాజావారి పనులన్నీ పూర్తి చేసి జక్కం వీరన్న మా ఊరొచ్చేనాటికి అతనికి మాంసం లేకపోతే ముద్ద దిగడం లేదిప్పుడు. మందు లేకపోతే క్షణం గడవదు. మొత్తానికి అలాంటి వీరన్న ఇలాంటి దశకొచ్చేసేడు.

ఇప్పుడు జక్కం వీరన్నని ఎవరన్నా పన్లోకి తీసుకెళ్ళాలంటే సైకిలో మోటారు సైకిలో వేసుకురావాలి. అతనెప్పుడు లేస్తాడో తెలీదు లేచేకా స్నానం అదీ చేసి పూర్వంలాగ పూజలూ అవీ లేవు. దేవుడి పటానికి దణ్ణపెట్టుకుని వీభూది బొట్టు పెట్టుకు బయల్దేరడం అదీ ఇప్పుడు లేదు.

వెళ్లేక పని మొదలెట్టిన కాస్సేపటినించే టీకి బదులుగా ఆరారా స్టీలుగ్లాసులో సారా పోస్తుండాలి. మధ్యాన్నం వేట మాంసంతో భోజనమో పలావో పెట్టించాలి. ఆ తర్వాత పడుకుంటాడు. ఎప్పుడు లేస్తాడో తెలీదు. సాయంత్రం ఇంటి దగ్గర దింపాలి.

ఇలా కొన్నాళ్ళు గడిచేసరికి జక్కం వీరన్నకి తాగుడు బాగా ఎక్కువైపోడంతో చెయ్యలేక పోతున్నాడు. దాంతో, పన్లోకి పిలవడం మానేసేరు.

దాంతో,

చాలా కోపం వచ్చేసింది వీరన్నకి.

'నేను ఎవరు పిల్చినా రాను'' అని చాటింపు వేయించి, ద్రాక్షారామం భీమేశ్వరుడి గుడిలో కెళ్ళి ఇక తాగనని ఈశ్వరుడి దగ్గర ఒట్టేసి రామచంద్రపురం వంతెనకింద సామిల్లు దగ్గరకెళ్లి ఇరవై అడుగుల టేకు చెక్క వాళ్ళ దగ్గర అరువు తీసుకుని ఓ రాత్రిపూట దాన్ని వాళ్ళింటికి తెప్పించి ప్రతిరోజూ పొద్దుట్నుంచి రాత్రిదాకా వాళ్ళ దొడ్లో కూర్చుని ఆ చెక్కతో తన దగ్గరున్న పరికరాలన్నీ ఉపయోగించి గొలుసు చెక్కడం మొదలెట్టాడు. ఎక్కడా జాయింటు అనేది లేకుండా ఇత్తడి గొలుసులాగ చెక్కతో గొలుసు చెక్కడం మొదలెట్టాడు.

‘‘ఎలాంటి అతుకూలేకుండా చెక్కతో గొలుసు చెక్కడమేంటీ విడ్డూరం’’అని దీని గురించే చెప్పుకునేవారు. కొందరయితే పనిగట్టుకు చూడ్డానికెళ్ళేరు.

అడ్డంగా విభూదిరేఖలు దిద్దుకుని నుదుటి దగ్గర పెద్ద కుంకుమబొట్టు పెట్టుకున్న పనిలో లీనం అయిపోయి ఉన్న వీరన్న చూస్తున్నవాళ్ళకి సాక్షాత్తూ శివుడి అవతారం లాగ కనిపిస్తున్నాడు.

ఆర్నెల్లయ్యేసరికి ఇరవై అడుగుల చెక్కగొలుసు చెక్కడం పని పూర్తి చేసేడు జక్కం వీరన్న.

అదిచూసిన ఊళ్ళో రెడ్లు రాజేశ్వరస్వామి గుడి దగ్గర పందిరి వేయించి చాలా పెద్ద ఎత్తున సన్మానం చేసేరు. ఎక్కడెక్కడినించో వచ్చి ఆ గొలుసుని చూసిన మేస్త్రులు పాదాభివందనం చేసేరు వీరన్నకి.

ఒకరోజు సాయంత్రం వడ్రం మేస్త్రులంతా లాకుల దగ్గరకి మందు సీసాల్తో వచ్చి ఇవ్వేళ నీకు పార్టీ ఇస్తన్నాం అన్నారు.

నవ్వేసిన వీరన్న ‘‘ద్రాక్షారంలో మా శివుడు దగ్గర మానేసేనని ఒట్టేసేను... నేను తాగుడు మానేసేను’’ అన్నాడు.

‘‘ఒకసారి మానేసిన నువ్వు మళ్ళీ మొదలెట్టగలవు మళ్ళీ మానెయ్యగలవు ..ఆ నిగ్రహశక్తి నీకొక్కడికే ఇచ్చేడు శివుడు’’ అన్నాడు మేస్త్రి బుద్దాచారి.

ఆ బుద్దాచారి మాటకి వంత పాడేరంతా.

నవ్విన వీరన్న కామోసు అనుకుని ‘‘సరే ఈవేళకి మీకోసం పుచ్చుకుంటాను. రేపొచ్చి మళ్ళీ బలవంతం చెయ్యొద్దు’’ అని ఒకసారి ఆ శివుణ్ణి తల్చుకుని గ్లాసందుకున్నాడు.

మర్నాడు మళ్ళీ లాగింది మందు మీదికి. ఈ వేళ ఒక్కరోజే అనుకుని తాగేసి మర్నాడు ప్రొద్దుట అష్టేశ్వరాలయాల్లో ఒకటయిన కోటిపల్లి వెళ్లి ఇక ఈ జన్మలో తాగను అని కోటిపల్లీశ్వరుడి ముందు ఒట్టేసుకుని బస్సెక్కి తిరిగి ఇంటికొచ్చేడు.

ఆ సాయంత్రం ఎవడో వచ్చి గిల్లేసరికి మళ్లీ తాగేసి మర్నాడు పొద్దుటే అష్టేశ్వరాయాల్లో ఇంకోటయిన పెనుమళ్ళ వెళ్ళి ఒట్టేసుకున్నాడు.

ఆ మర్నాడు మళ్ళీ లాగింది.

మళ్ళీ తాగేడు.

మర్నాడు పొద్దుట దంగేరు వెళ్ళి తాగనని ఒట్టేసుకొచ్చేడు.

ఇలా తాగడం. ఒకోరోజు పొద్దుట ఒకో గుడికెళ్ళడం చేసేవాడు.

మొత్తానికి తాగుడు జక్కం వీరన్నని గెల్చిందిగానీ, జక్కం వీరన్న తాగుడ్ని గెలవలేక పోయేడు.

కొన్నాళ్ళకి చేతుల్లో ఒణుకు మొదలై పోను పోను పెరిగింది.

* * *

ఇప్పుడు కుందయ్య సారా కొట్టు దగ్గర కూర్చుని రోడ్డమ్మట వెళ్ళేవాళ్ళకి వచ్చేవాళ్ళకీ తను చెక్కిన పొడుగాటి గొలుసు చూపించి అడుక్కుంటా ఆళ్ళిచ్చిన డబ్బుల్తో సారా తాగుతా చివరిరోజులు గడుపుతున్నాడు జక్కం వీరన్న.

* * *